
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మూడు గంటల కరెంటు మాటే వద్దు..

# కర్షక వ్యతిరేకి కాంగ్రెస్‌ను తరుముడే..



- 10 హెచ్‌పీ మోటర్లు పిచ్చి ఆలోచన
- కాంగ్రెస్ పాలనలో పొలాల వద్ద నరకం చూశాం
- చీకటిరోజులనుమర్చిపోలేమంటున్నరైతన్నలు
- ధరణిపోర్టల్‌తో దళారులకు చెక్
- తహసీల్ కార్యాలయాల్లోనే సాఫీగా రిజిస్ట్రేషన్లు
- రైతు ప్రభుత్వం బీఆర్‌ఎస్‌కే అన్నదాతల పూర్తి మద్దతు

**రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి** 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తూ ఆనందంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. సాగుకు 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. కాంగ్రెస్ అర్థం లేని మాటలపై రైతులు మండిపడుతున్నారు. అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో షాక్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు. సమైక్య పాలనలో భూ రికార్డుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. భూమి అనుభవదారు ఒకరుంటే, రికార్డుల్లో పట్టాదారు మరొకరు, కబ్జాదారు ఇంకొకరు ఉండేవారు. ఫలితంగా నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు, కోర్టుల్లో దావాలు వేసే పరిస్థితి. అలాంటి పరిస్థితిని స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా తాసీల్దార్‌కు రెవెన్యూ అధికారాలు అప్పగించి పది నిమిషాల్లోనే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌తో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమవడమే కాకుండా లెక్కలన్నీ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 27



## మూడు గంటలు ఇస్తే ఏం చేసుకోవాలి

సీఎం కేసీఆర్ సారు వచ్చిన తర్వాత నీళ్ల సౌలత్ మంచిగా అయ్యింది. నాకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. నాడు ఒక ఎకరం కూడా పారలే, ఇప్పుడు నాలుగు ఎకరాలు పారుతున్నది. కేసీఆర్ దయ వల్ల నేడు 24గంటల కరెంట్ ఇస్తున్నారు. 24 గంటల కరెంట్ వద్దన్న వాళ్లకు ఎవుసం తెల్వదు. రైతుల బాధలు తెల్వవు. దొయ్యలకు నీళ్లు కాదు, తాగుదామంటే శారెడు నీళ్లు దొరకలే, కాంగ్రెస్ నాయకులకు ఊకే ఏదో ఒక లొల్లి కావాలి. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే ఏం చేసుకోవాలి. ఎవుసం బంద్ చేసుకోవాలి. అప్పుడు కాంగ్రెస్‌వాళ్ల కండ్లు సల్లబడుతాయి. రైతులంతా కేసీఆర్ సారు వెంటనే ఉన్నారు.

– పొన్న బాలమల్లయ్య, రైతు, కడవేర్గు, చేర్యాల

## మూడు గంటల కరెంట్ ఎట్లా సరిపోతది?



ఎవుసానికి ఇప్పుడు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఏ బాధ లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నాం. కాంగ్రెసోళ్లు అంటున్నట్లు ఏ లెక్కన మూడు గంటల కరెంట్ సరిపోతది. 10 ఏండ్ల క్రితం నీళ్లు లేక కరెంట్ రాక పొలాలు ఎండిపోయిన రోజులు వాళ్లకు కనిపించ లేదా, రాత్రి, పగలు కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెల్వక మోటర్లకాడనే కావలి కాచిన రోజులు ఉన్నాయి. సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేశాం. మూడు గంటల కరెంట్ అని కాంగ్రెస్ అంటే మళ్లీ మన రైతులు పొలాలను విడిచిపెట్టి రోడ్డెక్కుతారు. 10 హెచ్‌పీ మోటర్లు రైతులు కొనాలంటే సాధ్యం కాదు. సీఎం కేసీఆర్ సారు ఫుల్ కరెంట్, నీళ్లతో పంటలు పండించుకుంటున్నాం. ఇట్లా ఉంటేనే రైతులు ధైర్యంగా బతుకుతారు.

– లింగయ్య, రైతు, దుబ్బాక

## ఒక్క మడి కూడా పారదు



మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా పారదు.10 హెచ్‌పీ మోటరు పెట్టుకోమంటే... ఎట్లా పెట్టుకోవాలే. ఇప్పుడు ఉన్న మోటర్లు, పైపులన్నీ తీసేసి పాత ఇనుప సామానుకు అమ్ముకొని లక్షలు పెట్టి కొత్త 10 హెచ్‌పీ మోటరు, పెద్ద పైపులు కొనుక్కోమంటున్నారు. కాంగ్రెస్ నాయకులు దండగ మాటలు చెప్పడం బంద్ చేయాలి.ఓట్ల కోసం ఏది పడితే.. అది మాట్లాడొద్దు. రైతులంతా 10 హెచ్‌పీ మోటర్లు పెడితే...కరెంట్ ఎంత కావాలే, తోడేందుకు భూమిలో అంతగా నీళ్ల ఊట ఊరుతుందా ..అది తెలుసుకుని మాట్లాడాలి. కాంగ్రెసోళ్లు ఎన్నికల ముందు గిట్లనే రైతులను ఆగమాగం చేస్తరు. వాళ్ల మాటలు ఏ రైతు కూడా నమ్మరు. –కల్వకుంట్ల రాజిరెడ్డి, పోతారం, దుబ్బాక

## అప్పట్లో అప్పుల పాలయ్యాను



కాంగ్రెస్ హయాంలో అటు నీళ్లు లేవు, ఇటు సమయానికి కరెంట్ వచ్చేది కాదు. దొంగ రాత్రి వచ్చే కరెంట్ కోసం పోతే రైతు మళ్లీ ఇంటికి వచ్చేది నమ్మకమే లేకుండే. రైతు బాయికాడ పొలానికి నీళ్లు పెట్టడానికి పోతే పాముకాటుకో, కరెంట్‌షాక్‌కో బలయ్యే వాళ్లు. ఇప్పుడు 24గంటల కరెంట్‌తో రైతులంతా వీలైన టైంకు పోయి పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నాం. కొండపోచమ్మ సాగర్, ఇటు మల్లన్నసాగర్ ప్రాజెక్టు దగ్గర కావడంతో బోరుబావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. 24గంటల కరెంట్ సరఫరా చేయడంతోపాటు ప్రభుత్వం రైతుబంధు ఇస్తుండే.. పైసలు లేకుండా కరెంట్, నీళ్లు రెండూ రావట్టే. రైతు పంట సాగు చేయడానికి ఇవే ముఖ్యం కదా. ఇప్పుడు రైతులంతా సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇట్లాంటి ప్రభుత్వమే రైతులకు అవసరం. మళ్లీ కాంగ్రెస్ వస్తే రైతులకు ఆత్మహత్యలే దిక్కవుతాయి. 60ఏండ్లు ఏమీ చేయనివాళ్లు ఇప్పుడు వచ్చి ఏం చేస్తారు. రైతులకు మంచి చేసే కేసీఆరే మళ్లీ సీఎం కావాలి.

– వడియారం దేవదాసు, రైతు,క్యాసారం, గజ్వేల్ అర్బన్

## వ్యవసాయానికి ఇబ్బందులు లేవు



సీఎం కేసీఆర్ సారు వచ్చినప్పటి నుంచి వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది లేదు. మా ఊరి డ్యామ్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి.24గంటల కరెంట్ వస్తుండడంతో 10ఎకరాల్లో పంటలు పండించుకుంటున్నాం. సీఎం కేసీఆర్‌ను పడగొట్టాలని కొన్ని పార్టీల నాయకులు నక్క తొవ్వలు తొక్కుతున్నరు. అన్ని మంచి పనులు చేసిన కేసీఆర్ సారును కాదని కాంగ్రెస్ పార్టీని రైతులు నమ్మరు, గ్రామాలకు వచ్చి చూస్తే వొడ్లు ఎన్ని పండుతున్నాయో తెలుస్తుంది.కరెంట్ మూడు గంటలు ఇస్తే ఏం చేసుకోవాలి, పారిన దొయ్య మళ్లీమళ్లీ పారుతది. బాయిల కాడ మళ్లీ కావాలి ఉండాలి. పాత రోజులు మళ్లీ రావాలని ఎవరూ కోరుకోరు.

– మేడబోయిన నర్సయ్య, రైతు, పోతిరెడ్డిపల్లి, చేర్యాల

## పంటలు ఎండుడు ఖాయం



హుస్నాబాద్, నవంబర్ 27: కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంట్ ఇచ్చి 10హెచ్‌పీ మోటర్లు పెడితే పంటలు పండుడేమో కానీ ఎండుడు మాత్రం ఖాయం. వాళ్లు చెప్పినట్లు చేస్తే ఎనకటి ఎవుసం ముందటికొస్తది. కాంగ్రెస్ పాలనలో ఆరు గంటల కరెంట్ ఇస్తేనే సగం పంటలు ఎండిపోయాయి. ఇప్పుడు మూడు గంటలు ఇస్తే ఎట్ల సరిపోతదో వాళ్లకే తెలువాలి. ఎవుసం గురించి తెల్వనోడు మాట్లాడితే తల, తోక ఒక్కటే అంటాడు... ఇటువంటోళ్లు రేపు అధికారంలోకి వస్తే రైతులు ఎన్ని ఇబ్బందులు పడతారో వాళ్ల మాటలు, హామీలను బట్టి తెలుస్తుంది. కేసీఆర్ సర్కారు 24గంటల కరెంట్ ఇచ్చి పుష్కలంగా సాగునీటిని అందుబాటులో ఉంచితే పుట్లకొద్ది పంటలు పండించుకుంటున్నాం. పెట్టుబడి సాయంతో అప్పులు లేకుండా ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తవాళ్లు వచ్చి కొత్త రూల్స్ పెట్టి రైతులకేదో చేస్తామని చెప్పితే నమ్మే స్థితిలో లేరు. ఎవరెన్ని హామీలు ఇచ్చినా నీళ్లు, కరెంట్ ఇచ్చి ఆర్థిక సాయం చేస్తున్న వారికే రైతులు మద్దతు ఇస్తారు. కాంగ్రెసోళ్లు చెప్పే మూడు గంటల కరెంట్, 10హెచ్‌పీ మోటర్లు అనేవి ఏమాత్రం రైతులకు సరిపోదు. ఇలా చెప్పేవాళ్లను నమ్మి రైతులు మోసపోవద్దు. – తిరుమల్‌రెడ్డి బాల్‌రెడ్డి, రైతు, బంజేరుపల్లి, హుస్నాబాద్ మండలం

## 24గంటల కరెంట్ లేకపోతే ఎవుసం నడవదు



24గంటల కరెంట్ లేకపోతే ఎవుసం నడవదు. మూడు గంటల కరెంట్‌తో ఓ మూల కూడా పారది. తెలంగాణ రాకముందు వ్యవసాయానికి నీళ్లు లేక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాం. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ సరఫరా చేయించడం వల్లనే ఇంత పంట పండి మా బుక్క మేము తింటున్నాం. అప్పుడు కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెల్వకుంట ఉండే. వచ్చిపోయే కరెంట్‌కు మోటర్లు కాలిపోతుండే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కరెంట్ పోవుడనేదే లేదు. నిమ్మలంగా ఇంటికాడనే ఉండి పొలం పారించుకుంటున్నాం. రైతులకు ఇబ్బంది కలుగకుండా సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. కాంగ్రెసోళ్లు చెప్పే మూడు గంటల కరెంట్‌తో రైతులు ఎవుసం చేసుకోలేరు. మళ్లీ ఏ దుబాయి, మస్కట్‌ పోవాల్సిందే.

–జగ్గం శ్రీశైలంగౌడ్, రైతు, బెక్కల్, ధూళిమిట్ట మండలం

## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కటకటే



మర్కూక్, నవంబర్ 27: పదేళ్ల క్రితం కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలను చూశాం.మళ్లీ వాళ్లు వస్తే మూడు గంటల కరెంట్ కూడా ఇవ్వరు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోని వాళ్లు ఎన్నికల్లో గెలుపొందాలనే ఆశతో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్‌కు రైతులందరూ మద్దతు ఇస్తున్నారు. కాంగ్రెసోల్లను నెత్తిన పెట్టుకొని కరెంట్ కష్టాలు మళ్లీ కొనితెచ్చుకోం. కారు గుర్తుకు ఓటు వేస్తాం.మూడోసారి సీఎం కేసీఆర్ రావాలి.


–దేశమైన నర్సింహులు, చేబర్తి, మర్కూక్ మండలం

## సీఎం కేసీఆర్ మంచి చేస్తుండు



సిద్దిపేట కమాన్, నవంబర్ 27: గిప్పుడు ఎవుసం పండుగలా కొనసాగుతుంది. గప్పట్లో (కాంగ్రెస్ పాలనలో) కరెంట్, నీళ్లు ఉండకపోతుండే. పశువుల నీళ్లకు కూడా అరిగోస పడ్డాం. యాళ్ల తప్పి కరెంట్ వచ్చేది. ఇట్ల వచ్చి అట్ల పోయేది. కరెంట్ కోసం కావాలి ఉండి అందరూ ఒక్కసారే స్టార్టర్లు ఆన్ చేసే వరకు ట్రాన్స్‌పార్మర్ల మీద ఫీజు ఎగిరిపోతుండే. మళ్లీ ఫీజువేసే వరకు కరెంట్ పోతుండే ఇట్ల కరెంట్ తిప్పల వల్ల వరిపొలాలు పారకపోతుండే. కాంగ్రెస్ పాలనలో వచ్చేపోయే కరెంట్ వల్ల పంటపొలాల ఎండిపోతుండే. రాత్రి పూట కరెంట్ సక్రమంగా రాక బావుల కాడ ఉండి పొలాలు పారించేటోళ్లం. ఇంటి కాడ ఇడిచిపెట్టి చలికి, వానకు బాయికాన్నే జాగారం చేసేది. కాంగ్రెసోళ్లు చానా ఇబ్బంది పెట్టిన్రు. ఇప్పుడు ఎన్నికల కోసం మూడు గంటల కరెంట్ పెడ్తమంటున్నరు. మూడు గంటల కరెంట్ ముందుకు సాగదు ఎవుసం. అప్పుడే (గతంలా) సక్కగ పారలే.. మూడు గంటల కరెంట్ వల్ల గిప్పుడు ఎట్ల పారతది. ఎవుసం తెలిసినోడు ఆ మాట మాట్లాడడు. మోసేటోనికే బరువు తెలుత్తదన్నంటూ.. పనిచేసేటోనికే ఎట్ల పారతదని తెలుత్తది. ఇప్పుడు ఉన్న భూమి మొత్తం పారుతంది. తెల్లదాకా బావులకాడికి పోయే బాధ తప్పింది. ఎప్పుడు పడితే అప్పుడే కరెంట్ పెట్టుకుంటున్నాం. గింత మంచిగ చేసినోళ్లను మర్చిపోతమా.. సీఎం కేసీఆర్ ఒక్కడే రైతులకు మంచి చేత్తుండు.

– పాలడుగు రాంరెడ్డి, రైతు, లింగారెడ్డిపల్లి, సిద్దిపేట






## అరగంటలోనే రిజిస్ట్రేషన్



అరగంటలోనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. గతంలో చాలా రోజులు పట్టేది. మునుపటి గోస పోయింది. భూమి కొనాలంటే వీఆర్‌ఏలు, వీఆర్‌వోలు గోస పెట్టేవారు, పైసలు ఇస్తేనే పని జరిగేది. లంచం లేకుంటే పని జరిగేది కాదు. నెలల కొద్దీ కార్యాలయాల చుట్టూ తిరిగేది. ఇప్పుడు అరగంటలోనే పని అయిపోతుంది. ధరణితో పనులు సులువయ్యాయి. మునుపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత జమాబంది అమలు కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. చాలా రోజులకు పాసుబుక్కులకు ఎక్కేది. ఇప్పుడు వెంటనే పాసుబుక్ వస్తుంది.

–సింగిరెడ్డి పవన్‌రెడ్డి, రైతు, కోహెడ

## ధరణి ఉంటేనే భూములకు రక్షణ



ధరణి తీసేస్తే రైతుల భూములకు రక్షణ ఉండదు, మళ్లీ పాత కథే.. వీఆర్‌వోలు, ఆర్‌ఐ, తహసీల్దార్ల చుట్టూ తిరగాల్సిందే. పైరవీకారులు, బ్రోకర్ల రాజ్యం వస్తది. పైసల ఖర్చు తప్పా రైతులకు తిప్పలు తప్పవు. కాంగ్రెస్ నాయకులకు ఎద్దు ఎవుసం తెల్వదు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడ్డారు. ధరణి వల్ల భూములకు రక్షణ వచ్చింది. వేలి ముద్ర పెడితేనే భూములు ఇతరుల మీదికి మారుతాయి. పాత పద్ధతి అయితే వీఆర్‌వోలు రికార్డులు తారుమారు చేస్తారు. అంతా గందరగోళంగా తయారు చేసి రైతుల మధ్య గొడవలు తయారవుతాయి.

–ఎల్లముల వెంకటేశం, రైతు, గుర్రాలగొంది

## ధరణి పోతే... మళ్లీ ఆగం బతుకులే



బీఆర్‌ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణే మంచిగా ఉంది. ఏపైరవీ లేదు. ఎవలకు పైసలు ఇచ్చుడు లేదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని తహసీల్ కార్యాలయానికి వెళ్లే రిజిస్ట్రేషన్ పనులు జరుగుతున్నాయి తాతల కాలం నుంచి కానీ భూముల పట్టాలు ధరణి వచ్చిన తర్వాత అయినాయి. భూముల ధరలు పెరిగినందుకు ధరణి లేకపోతే రైతులు కొట్టుకుసత్తుర్రు. కేసీఆర్ సారు మంచిగా ఆలోచన చేసిండు. రైతుల బాధలు తప్పాయి. ఎవరి భూములు వాళ్ల చేతుల్లోనే ఉండేటట్లు చేసిండు. లేకపోతే రెండు, మూడు ఏండ్లు ఊరు విడిచిపెడితే వచ్చే సరికి భూములు మాయమయ్యేవి. రికార్డుల నుంచి పేర్లు తొలిగిపోయేది. ఇప్పుడేదో కాంగ్రెస్ మళ్లీ ధరణి తీసేస్తాం అంటే ఊరుకునేదే లేదు, వాళ్లకు ఓట్లు వేయకుండా, వాళ్లనే తీసేస్తే అయిపోతది.

– సత్యనారాయణ, రైతు, అక్కన్నపేట

## ధరణిని తీసేస్తే మళ్లీ పైరవీలే..



చిన్నకోడూర్, నవంబర్ 27: భవిష్యత్ ఆలోచనతో సీఎం కేసీఆర్ ధరణిని తీసుకొచ్చారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే గంటలో భూమల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయిపోతుంది.పోస్టులో పాస్‌బుక్ ఇంటికి పంపుతున్నారు. డూప్లికేట్ పాస్‌బుక్ అప్పటికప్పుడు తహసీల్ కార్యాలయంలో ఇస్తున్నారు. ఎవరి భూములు వారికి ఉన్నాయి. మాకు బాధలు తప్పాయి. ధరణిని తీసేస్తే మళ్లీ పైరవీల రాజ్యం వచ్చుడు ఖాయం. ఇప్పుడే మంచిగున్నది. ఒక్కరోజులో ఆన్‌లైన్‌లో భూమి మార్పిడి అయినట్టు కనిపిస్తున్నది. ఫోన్‌కు మెసేజ్ కూడా వస్తున్నది.

– వెంకట్‌రెడ్డి, విఠలాపూర్, చిన్నకోడూర్ మండలం

## గిప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుడు తప్పింది



సిద్దిపేటరూరల్, నవంబర్ 27: గతంలో భూ సమస్యలు మస్తుగా ఉండే. పరిష్కారం కాక కోర్టులకు కూడా పోయేటోళ్లు. భూములు పట్టాకు రావాలంటే ఏండ్లుగా తిరిగాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ మంచి ఆలోచనతో ధరణిని తెచ్చిండు. మీ సేవకు పోవుడు..రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునుడు చకచకా అయిపోతుంది. ఒకేరోజు రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ అవుడు సాధ్యమేనా అని అనిపించింది. ఆన్‌లైన్‌లో సుత భూమి పేరు మార్పిడి అప్పటికప్పుడు అవుతుంది. గంటలోపల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డూప్లికేట్ పాస్‌బుక్ ఇస్తుండ్రు. ఇది నిజంగా గొప్ప విషయం. రైతులకు తిప్పలు తప్పాయి. గతంలో ఎమ్మార్వో, వీఆర్ఏల చుట్టూ తిరిగేది. ఇప్పుడు ఆ బాధలు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేసి కొత్తది ఏదో తెస్తం అని అంటుండ్రు. ఇప్పుడు రైతుల భూములు ధరణిలో కనిపిస్తున్నాయి. ఎవరి భూములు వాళ్లకే ఉన్నాయి. పైరవీలు చేసి పేర్లు మార్చితే కోర్టుల చుట్టూ తిరుగుడు అయితది. గివన్నీ బంధు కావాలనే కేసీఆర్ ధరణి తెచ్చిండు. చిన్నపాటి సమస్యలు ఏమైనా ఉంటే మెల్లగా పరిష్కారమవుతాయి. రైతులు పొలం పనులు వదిలి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తే మంచిదా.. అధికారులు కూడా ఇబ్బందులు పెడితే లంచం ఇవ్వక తప్పదు. పనికాకుంటే ఏదోఒకటి చేయాలె..గతంలో రిజిస్ట్రేషన్ అయినా భూమి పాస్‌బుక్కులు రావాలంటే ఆరునెలలు పట్టేది. వీఆర్‌ఓలు, ఎమ్మార్వో చుట్టూ తిరిగేతే పని కాకపోయేది. గిప్పుడు ఒక్కరోజులో ఆన్‌లైన్‌లో భూమి మార్పిడి అయినట్టు కనిపిస్తున్నది. ఫోన్‌కు మెసేజ్ కూడా వస్తున్నది.

– కొమ్మిడి వెంకట్‌రెడ్డి, రాఘవాపూర్, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, సిద్దిపేట రూరల్ మండలం